## పార్టీ పటిష్టత, మండలాభివృద్ధిపై సమీక్ష..

మడకశిర టౌన్ నవంబర్ 12 ప్రభాతవార్త



టీడీపీ నేతలు, కార్యకర్తలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజు

మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు . నియోజకవర్గంలో పార్టీ బలోపేతం దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నేతలు, కార్యకర్తలతో వరుస సమావేశాలతో బిజీ బిజీగా గడుపుతున్నారు. గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా దూసుకెళుతున్నారు. ఇందులో భాగంగానే మడకశిరలోని క్యాంపు కార్యాలయంలో రొళ్ల మండలం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. మండలంలోని పార్టీ నిర్మాణం, పార్టీ బలోపేతం అనే అంశాలపై నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. మండలం అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. రానున్న కాలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత వేగంగా అందించేందుకు అవసరమైన విధివిధానాలపై ఎమ్మెల్యే చర్చించారు. నాయకులు, కార్యకర్తలు తమ తమ గ్రామాలు, మండలంలో నెలకొన్ని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటన్నింటినీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో పార్టీని పటిష్టం చేయాలని, దుర్మార్గుల దుష్టపన్నాగాల నుండి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడమే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చంద్రబాబుగారిని ముఖ్యమంత్రి పీఠం మీద ఎన్నిసార్లు అయినా కూర్చోబెట్టడమే కర్తవ్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రాభివృద్ధి, మెరుగైన సంక్షేమం అమలవుతుందని పేర్కొన్నారు. త్వరలోనే గ్రామకమిటీలన్నింటినీ పూర్తిచేసి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నిర్వహించే అంశాలపైనా చర్చించారు. కార్యక్రమంలో రొళ్ల మండలం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇచ్చే చిక్కీలను చెక్కేస్తున్నారు.. గుడ్లను గుటుక్కుమనిపిస్తున్నారు

### - పౌష్టికాహారం నష్టపోతున్న చిన్నారులు

అగళి, నవంబర్ 12 ప్రభాతవార్త

ప్రభుత్వం విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్న ఉద్దేశ్యంతోమధ్యాహ్న భోజనాన్ని ప్రవేశ పెట్టింది. అన్నం, సాంబారు. పప్పుతోపాటు కోడి గుడ్లను, చిక్కీలను విద్యార్థులకు పంపిణీ చేయాలని నిబంధనలు ఉన్నాయి. పాఠశాలలతోపాటు ఆదర్శ పాఠశాల, కళాశాల, కెజిబివి వీటన్నింటికీ ఏజెన్సీల ద్వారా కోడిగుడ్లను, చిక్కీలను సరఫరా చేస్తున్నారు. గత రెండు నెలలుగా మండలంలోని పాఠశాలలకు మొదటి వారం, చివరి వారం కోడిగుడ్లను, చిక్కీలను సరఫరా చేస్తున్నారు. నెలలో రెండు మూడు వారాల్లో చిక్కీలను చెక్కేస్తున్నారు.. గుడ్లను గుటుక్కుమనిపిస్తున్నారు. ప్రభుత్వం వద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని మంచి పౌష్టికాహారం సరఫరా చేయాలన్నిపోతంది. మ ద్యలోనే ఏజెనస్సీ వారు సక్రమంగా సరఫరా చేయక ఇబ్బందులు పెట్టి వాటిని మింగుతున్నారు. సంబంధిత ఎంఈఓలు తరచూ పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్నాం భోజనం లిస్టు తీస్తే కొంత వరకరు ఈ స్వాహా చేయడాన్ని అరికట్టవచ్చు. తూతూ మంత్రంగా పోకుండా పాఠశాలలకు వెళ్లి కఠినంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. సదరు విషయమై ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడును వివరణ కోరగా కోడిగుడ్లు, చిక్కిలు ఇవ్వని విషయం తమ దృష్టికి వచ్చిందని, తరచూ తనిఖీలు చేసి ఇక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఇసుకను ఇతర ప్రాంతాల్లో డంప్ చేస్తారు.. అటు నుంచి కర్ణాటకకు తరలిస్తారు

అగళి, నవంబర్ 12 ప్రభాతవార్త

ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా ఇండ్లు, మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెట్టింది. మండల వ్యాప్తంగా దాదాపు 7 కిలోమీటర్ల వరకు సువర్ణ ముఖి ఉంది. ఏటిలో ఉన్న ఇసుకను తీసుకెళ్లి కర్ణాటక రాష్ట్రంలో అప్పిహళ్లి, చెందనకుంటే తదితర కర్ణాటక రాష్ట్రాల గ్రామాల్లో ఇసుకను డంప్‌చేసి శిర, తుమకూరు, బెంగుళూరులాంటి ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. మండలానికినూతనంగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. అర్హులైన లబ్దిదారులకు హౌసింగ్ శాఖ వారు ఇండ్లను మంజూరు చేశారు. వాటిని జియో ట్యాగ్ చేస్తున్నారు కానీ ఇంకా ఇండ్ల ప్రస్తావన రాలేదు. అయినాన సువర్ణ ముఖి నదిలో ఉన్న ఇసుక మాత్రం ఖాళీ అయింది. గతంలో సువర్ణ ముఖి నదిలో ఇసుకను తోలడం మూలంగా వేలాది బోర్లు, బావులు ఎండిపోవడంతోపాటు వేలాది వక్క, కొబ్బరి చెట్లు ఎండిపోయాయి. ఇసుకను తవ్వడం మూలంగా భూగర్భ జలాలు అడుగంటి పండ్లతోటలు, చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు నీళ్ల లేక అగళి చెరువు 30 సంవత్సరాలుగా నిండలేదు. కాని గత రెండుమూడేళ్ల క్రితం మండలంలోని చెరువులు, అగళి చెరువుతో అన్ని నీటితో కలకలలాడాయి. ఎగువన కురిసిన వర్షానాకి చెరువుల్లోకి నీరు చేయడంతోపాటు ఇసుక కూడా వచ్చింది. కానీ ఇసుకను అక్రమరవాణా చేసే వారు దీనిని అదునుగా చేసుకుని ఇసుక మొత్తాన్ని సువర్ణ మ ఉఖిలో ఖాళీ చేశారు. కొద్దో, గొప్పో ఉన్న ఇసుకను కూడా కర్ణాటక రాష్ట్ర గ్రామాల్లో రాత్రి వేళల్లో నిల్వ చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులుచొరవ తీసుకుని అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. అసలే ప్రభుత్వం ఇంకా ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించలేదు కానీ ఇసుక మాత్రం అప్పుడే మాయం అయిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

## టింబక్టు కలెక్టివ్ 35వ సంవత్సర వారోత్సవ వేడుకలు పోస్టర్ విడుదల

చెన్నేకొత్తపల్లి, నవంబర్ 12 ప్రభాతవార్త



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

టింబక్టు-కలెక్టివ్ 35వ సంవత్సర వేడుకలకు సంబంధించిన పోస్టర్లను స్థానిక సంస్థ ప్రాంగణంలో బుధవారం సంస్థ వ్యవస్థాపకులు, బబ్లు గంగోలి చేతుల మీదుగా విడుదల చేశారు. వారోత్సవాల సందర్భంగా 14వ తేదీ శుక్రవారం ముందుగా కోలాటం కార్యక్రమం మొదలుకొని, చెక్కభజన, యక్షగానం, తోలుబొమ్మలాట, కర్ణుని ఏకపాత్రాభినయం, గయోపాఖ్యానం, సత్య హరిచంద్ర, వంటి కార్యక్రమాలతో, గ్రామీణ కలలను పునరుద్ధరించి, పూర్వ వైభవం తీసుకురావడంలో, టింబక్టు-కలెక్టివ్, సంస్థ, ప్రత్యేక శ్రద్ధతో, సహకారం స్ఫూర్తితో విజయవంతంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు



అదృశ్యమైన వ్యక్తి ఫైల్ ఫోటో

రొళ్ల నవంబర్ 12 ప్రభాతవార్త:

వ్యక్తి అదృశ్యంపై బుధవారం రొళ్ల పోలీస్ ఠాణాలో కేసు నమోదైనట్లుగా ఎస్ఐ వీరేష్ తెలిపారు. మండలంలోని బిజీ.హళ్లి గ్రామానికి చెందిన నరసింహామూర్తి(35) మతి స్థిమితం సరిగా లేకపోవడంతో అదృశ్యమైన ఘటనపై సంబంధిత బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అక్టోబర్ 30వ తేదీన నరసింహామూర్తి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి 12 రోజులు గడిచిన ఇప్పటి వరకు తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల బంధువుల ఇంట్లో అదృశ్యంపై గాలించిన అంచుకి లభ్యం కాలేదు అన్నారు. దీనిపై నరసింహామూర్తి సోదరుడు దేవరాజ్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు.

## పార్టీబలోపేతానికి కృషిచేయండి... పార్టీ అండగా ఉంటుంది

### జనసేనరాష్ట్ర ప్రధానకార్యదర్శిచిలకం మధుసూధన్‌రెడ్డి

ధర్మవరంటౌన్, నవంబరు 12 ప్రభాతవార్త



జనసేన పార్టీలోకి చేరుతున్న డ్వాక్రామహిళాసంఘాల సభ్యులు

జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేయాలని, పార్టీ అండగా ఉంటుందని పార్టీలోకి చేరిన డ్వాక్రా మహిళాసంఘాల సభ్యులకు, మహిళలకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుదసూదన్రెడ్డి సూచించారు. పట్టణంలోని కొత్తపేట, శాంతినగర్ కు చెందిన డ్వాక్రామహిళలు, మహిళలు 100 కుటుంబాలు బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో చిలకం బమధుసూదన్రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. వీరికి చిలకం మధుసూదన్రెడ్డి పార్టీకండువా వేసి సాదారంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన మహిళలు పవన్ కల్యాన్ సిద్దాంతాలు నచ్చి చేరామని తెలిపారు. అనంతరం చిలకం మధుసూధన్రెడ్డి మాట్లాడుతూ... జనసేన పార్టీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కట్టుబడి ఉందని పార్టీలోకి చేరిన ప్రతీ ఒక్కరికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కోసం నేను నిరంతరం అందుబాటులో ఉంటానని వారికి ఏ ఆపద వచ్చిన ఏ సమస్య ఎదురైనా ముందుండి పరిష్కరించడానికి కృషిచేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి పాల్గొన్నారు.

## శివాలయంలో గోనుగుంట్ల అభిమానుల ప్రత్యేక పూజలు

ధర్మవరంటౌన్, నవంబరు 12 ప్రభాతవార్త



కాశీవిశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తున్న గోనుగుంట్ల అభిమానులు

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, సతీమణి నిర్మలాదేవి వివాహ వార్షికోత్సవం సందర్భంగా గోనుగుంట్ల అభిమానులు స్థానిక కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు ద్వారకాస్వామి శివాలయంలో గోనుగుంట్ల దంపతుల పేరిట ప్రత్యేక పూజలు చేశారు. వారు నిండునూరేళ్ల జీవిస్తున్న ఇలాంటి వివాహ వార్షికోత్సవాలు జరుపుకోవాలని వారు స్వామికి పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలోగోనుగుంట్ల అభిమానులు సాహెబ్బీ ఏలుకుంట్ల అప్పస్వామి, నాగలూరు రామ్మూర్తినాయుడు, చిప్పలమల్లికార్జున, బొడగలగిరిదర్, గణేశ్, గంధమనేని నారాయణస్వామి, రాప్తాటిరాము, నారాయణస్వామియాదవ్, డిజైనర్ రాజా, పూజారి మల్లికార్జున, మదు, నాగరాజు, మురళి, అనిల్ పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైకాపా నాయకుల నిరసన అర్ధరహితం

### టిడిపి మండల క్లస్టర్ కన్వీనర్ అగ్రహారం నవీన్

అమరాపురం నవంబర్ 12 ప్రభాతవార్త



మండల క్లస్టర్ కన్వీనర్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పి 4 మోడల్ (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్నర్షిప్) విధానం పై మరియు మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ పై వైకాపా నాయకుల నిరసనలు అర్ధరహితమని మండల టిడిపి క్లస్టర్ కన్వీనర్ అగ్రహారం నవీన్ ఆరోపించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేట్ పరం అంటూ రాష్ట్ర ప్రజల్ని ప్రక్క దారి పట్టిస్తున్న వైకాపా నాయకులు పి 4 మోడల్ పై వైకాపా నాయకులకు అర్థం తెలుసుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వ ఆయాయంలో రాష్ట్ర ఖజానాను దోచిపెట్టి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో నెట్టిన వైకాపా నాయకులు మరల ఆపద్దపు మాటలతో జనం మధ్యలోకి వస్తున్నట్లు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఖజానాను గాడిలో పెట్టడానికి కూటమి నాయకత్వం పి4 విధానాన్ని అమలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వైద్య కళాశాలల నిర్మాణం అంటూ ఆర్భాటాలుచేసి తప్పును కప్పిపుచ్చుకోవడానికి వైకాపా శ్రేణులు ప్రయత్నిస్తున్నట్లు, ప్రస్తుతం రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక దిగజారుడురాజకీయాలు చేస్తున్నట్లు దీన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## కోలాహలంగా త్రిమూర్తుల స్వామిల ఊరేగింపు



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల నవంబర్12 ప్రభాతవార్త:

మండలంలోని ఆర్.గొల్లహట్టికి గ్రామంలో కొలువు దీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి, బాలకృష్ణ స్వామి, ఈరప్ప స్వామి త్రిమూర్తుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామివార్ల ఊరేగింపును ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ముందుగా మొక్కులు ఉన్న భక్తులు ఆలయాల్లో తలనీల స్థానాలు ఆచరించి స్వామివారికి తమ మొక్కులను చెల్లించుకున్నారు. తోలుతూ.. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. తదుపరి స్వామివారికి పుష్పాలంకరణ చేసి గ్రామంలోని పూరవీధులు కూడా వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి శ్రేణులు సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, రాష్ట్ర కుంచిటిగా ఒక్కలిగా సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, మండల కన్వీనర్ ఈరన్న, మాజీ ఎంపీపీ కృష్ణ, కార్యదర్శి ఉగ్రే గౌడ్, మూర్తి, రాజు, రాష్ట్ర ఏపీ ఐఐసి డైరెక్టర్ రామకృష్ణ, మీ సేవ వెంకటేష్, భరత్ ను ఆలయ కమిటీ సభ్యుల తరుపున ఘనంగా సన్మానించారు .కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఊరేగింపు ను వీక్షించారు.

## పందిపర్తిలో పొలం పిలుస్తోంది

సోమందేపల్లి నవంబర్ 12 ప్రభాత వార్త



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

మండలంలోని పంది పర్తి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కంది పంటను పరిశీలించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి విజయభారతి మాట్లాడుతూ ఖరీఫ్లో సాగు చేసిన కంది పంట ప్రస్తుతం కాయ దశలో ఉంది కావున కాయ ఈగ ఆశించి కాయలోపలే ఉండి గింజను తినేసి చాలా నష్ట పరుస్తుంది కావున గింజ గట్టి పడే దశలో మోనోక్రోటోఫాస్ 1.6 ద లేదా డైమిథోయేట్ 2 ద లేదా ప్రొఫినోపాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మరుకా మచ్చల పురుగు నివారణకు క్లోరో పైరిపాస్ 2 ద ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలసిందిగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ.విజయ భారతి, తినివీ అలేఖ్య ,జుబీతి వేణు ,శ్రీనివాసరెడ్డి రైతులు , పాల్గొనడం జరిగింది.

## రైతుల భూ సమస్యలకు రీ సర్వే శాశ్వత పరిష్కారం

### డైరెక్టర్ సర్వే సెటిల్మెంట్స్ ల్యాండ్ రికార్డ్స్ రోణంకి కూర్మనాథ

తాడిమర్రి నవంబర్ 12 (ప్రభాతవార్త)



రీ సర్వే కార్యక్రమం పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే వల్ల రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని డైరెక్టర్ సర్వే సెటిల్మెంట్స్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రోణంకికుర్మానాథ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పెద్దకోట్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే గ్రౌండ్ ట్రూథింగ్ కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. అక్కడి భూ సర్వే పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిసర్వే వల్ల భూసరిహద్దులు స్పష్టమవడంతో పాటు, భూ యాజమాన్యంపై ఉన్న పాత విభేదాలు, వివాదాలు తగ్గుతాయని అన్నారు. ముఖ్యంగా జాయింట్ LPMs వల్ల భవిష్యత్తులో తలెత్తే సమస్యలను దృష్టిలో ఉంచుకొని వాటిని సింగిల్ LPMs గా మార్చే ప్రక్రియను వేగవంతం చేయాలని, పట్టాదారులకు పూర్తి స్థాయిలో వివరించి, వారి అవగాహనతో సింగిల్ LPMs సృష్టించాలన్నారు. అలాగే రిసర్వేలో గ్రౌండ్ ట్రూథింగ్ అత్యంత కీలకమైన దశ అని పేర్కొంటూ, ప్రజలు తమ భూముల సరిహద్దులు, హక్కుల గురించి స్పష్టతతో స్పందించి, అవసరమైన పత్రాలు సమర్పిస్తే, రికార్డుల్లో తప్పులు లేకుండా ఖచ్చితమైన ఎంట్రీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ సత్యసాయి జిల్లా సర్వే అధికారి కుమారి పి. విజయశాంతి బాయ్, జిల్లా సర్వే అధికారి రూప్లనాయక్, ధర్మవరం డిప్యూటీ ఇన్స్పెక్టర్లు శామ్యూల్ బాబు, మురళీ కృష్ణ, అంజలి దేవి, బత్తలపల్లి మరియు తాడిమర్రి తహసీల్దార్లు, భాస్కర్ రెడ్డి తో పాటు మండల సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యసాయి జిల్లా సమగ్ర శిక్షలో ఏడుగురు అభ్యర్థులు పదవీ బాధ్యతలు స్వీకరణ

### పది పోస్టులు లలో ఏడు పోస్టులు భర్తీ చేయగా ఇంకా మూడు పోస్టులు ఖాళీ

కొత్తచెరువు నవంబర్ 12 ప్రభాతవార్త



సమగ్ర శిక్ష కార్యాలయం

సమగ్ర శిక్ష కి సెలెక్ట్ అయిన సెక్టోరియల్ ,అసిస్టెంట్ సెక్టోరియల్ అభ్యర్థులు బుధవారం సమగ్ర శిక్ష కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారుపాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నుంచి మంగళవారం ఏడు మంది అభ్యర్థులను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జూలై 26 న నోటిఫికేషన్ విడుదల చేయగా ఆగస్టు 20వ తేదీ అర్హత సాధించిన 34 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు సెలెక్ట్ అయిన అభ్యర్థులను రాష్ట్ర ఎస్పీడీ కార్యాలయానికి పంపగా ఎట్టకేలకు ఏడుగురు అభ్యర్థులను ఎంపికచేశారు. నోటిఫికేషన్‌లోఉన్న 10 పోస్టులలో ఇంకా మూడు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది, బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి సమగ్ర శిక్ష కార్యాలయంలో ఏడుగురు అభ్యర్థులు పదవి బాధ్యతలు స్వీకరించారు వీరిని ఫారిన్ సర్వీస్ కింద ఒక ఏడాది నియమించినట్లు తెలిపారు సెలెక్ట్ అయిన అభ్యర్థులు డిప్యూటేషన్ పై నియామక ఉత్తర్వులు అందజేశారు ఎంపికైన వారి వివరాలు.. ఐఈకోఆర్డినేటర్‌గా.. ఎస్పీ పుల్లన్న జడ్పీహెచ్ ఎస్ ఎనుమల వారి పల్లి ముదిగుబ్బ మండలం కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంఓ)గా కే హరిప్రసాద్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు గౌడనహళ్లి,. ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్ (అలెస్కో)గా ముజాపూర్ రెహమాన్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ పెద్ద గువ్వలపల్లి రొద్దం, మండలం. అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్ జనరల్ (ఏఎంవో)గా కే చంద్రశేఖర్ స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ జడ్పీహెచ్ఎస్ పెద్దమంతూర్ రొద్దం మండలం. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ)గా కే ఫణిరాజు శర్మ స్కూల్ అసిస్టెంట్ గణితం పెద్దమంతూర్ రొద్దం మండలం. అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఏపీవో)గా ఎస్.మాధన రెడ్డి ఎస్ ఎ ఫిజికల్ సైన్స్ జడ్పీహెచ్ఎస్ రొద్దం మండలం. అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ (ఎజిసిడి)ఓగా జి.అనిత ఎస్జిటి జడ్.పి.హెచ్.ఎస్ గాండ్ల పెంట నియమితులయ్యారు. నూతనంగా సమగ్ర శిక్షకి ఎంపికైన అభ్యర్థుల డీఈఓ కృష్ణపకు ఎపిసి డాక్టర్ పిదేవరాజునీ కలసి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం కార్యాలయం సిబ్బంది అభ్యర్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచండి ఆరోగ్యంగా జీవించండి-జడ్పీ సీఈవో శివశంకర్

తాడిమర్రి నవంబర్ 12 (ప్రభాతవార్త)



కునుకుంట్ల ఎస్సీ కాలనీలో ఆకస్మిక తనికి నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో శివ శంకర్

గ్రామాలలో నెలకొన్న పారిశుధ్యన్ని పారద్రోలి రోగాలను దరిచేరనీయకుండా తరిమికొట్టాలని జడ్పీ సీఈవో శివశంకర్ మండల ప్రజలకు పిలువునిచ్చారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన కునుకుంట్ల ఎస్సీ కాలనీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోపాటు పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అందుకు కారణమైన దోమలను నిర్మూలించేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రంగారావు డిప్యూటీ ఎంపీడీవో కృష్ణయ్యతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సబ్ ఇన్స్పెక్టర్ జి. ఖాజా హుస్సేన్‌కు ఎస్పీ ప్రశంసా పత్రం!

విడపనకల్లు నవంబరు 12 (ప్రభాత వార్త)




జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎస్.ఐ. జి. ఖాజా హుస్సేన్

విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకు గాను, విడపనకల్లు పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ జి. ఖాజా హుస్సేన్ మంగళవారం అనంతపురం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనను ప్రత్యేకంగా సత్కరించారు. విడపనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్.ఐ. జి.ఖాజా హుస్సేన్ శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మరియు ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన అసాధారణ సమర్థత, అంకితభావానికి గాను ఈ ప్రశంసా పత్రం లభించింది. ముఖ్యంగా, ఆయన నేతృత్వంలో పలు క్లిష్టమైన కేసులను పరిష్కరించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో మమేకమై పనిచేస్తూ చట్టంపై ప్రజలకు నమ్మకం పెంచడంలో చూపిన చొరవను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా గుర్తించారు. ప్రశంసా పత్రం అందుకున్న అనంతరం ఎస్.ఐ. ఖాజా హుస్సేన్ స్పందిస్తూ, ఉన్నతాధికారుల నుంచి అందిన ఈ గుర్తింపు, ప్రోత్సాహం తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా, అంకితభావంతో నిర్వర్తించడానికి అపారమైన స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

## ఉరవకొండలో ప్లాస్టిక్ నిషేదాన్ని పకడ్బందీగా అమలు చేయండి

### -మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోలక బాలరామాంజినేయులు

ఉరవకొండ, నవంబర్ 12 ప్రభాతవార్త



మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేదాన్ని పకడ్బందీగా అమలు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా మాజీ సభ్యులు మోలక బాలరామాంజినేయులు కోరారు. ఈమేరకు బుధవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోలక బాల రామాంజినేయులు మాట్లాడుతూ ఉరవకొండలో నిషేదిక ప్లాస్టిక్ కవర్ల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోందని దీంతో ప్రజలు వారికి తెలియకుండానే క్యాన్సర్ లాంటి భయంకరమైన రోగాలబారిన పడుతున్నార న్నారు. ఆహారం మొదలు, కూరగాయలు, పండ్లు, ప్యాకేజ్ వస్తువులు ఇలా అన్నింటికీ ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ నిషేదిస్తున్నట్లు ప్రకటించినా అమలులో లోపాలతో విచ్చలవిడిగా వినియోగం జరుగుతోందని అన్నారు. పంచాయతీ వెంటనే నిషేదిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విన్నవించారు.

## మొక్కజొన్న పంటలో కత్తెర పరుగు నివారణ చర్యలు చేపట్టండి

### -షేక్షానుపల్లి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏడీఏ, ఏవో

ఉరవకొండ, నవంబర్ 12 ప్రభాతవార్త



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకే అవకాశం ఉన్నందున దాని నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఉరవకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు అన్నారు. మండల పరిధిలోని షేక్షానుపల్లి గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ, ఏవో మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకుగాను ఎకరాకు 10 కేజీల చొప్పున కార్బోఫిరాన్‌ను సుడులలో వేయాలని లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును 2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి ద్రావణాన్ని సీసాలో పోసుకొని సుడులలో జార విడవాలన్నారు. వరిపైరు కంకి పాలు పోసుకునే దశలో ఉందని కాండం తొలుచు పురుగు సోకే అవకాశం ఉన్నందున దీని నివారణకుగాను ఖతాఫ్ హై డ్రోక్లోరైడ్ 4జి గుళికలను ఎకరాకు 8 కేజీల చొప్పున వరి పొలంలో చల్లవలసి ఉంటుందన్నారు. సుడిదోమ సోకే అవకాశం ఉన్నందున దీని నివారణకు మెట్రోజిన్ 120 గ్రాములు 100 లీటర్ల నీటిలో కలిపి మోదళ్లకు పడే విధంగా పిచికారి చేస్తే సుడిదోమను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం 90శాతం రాయితీతో అందించే డ్రిప్పు పరికరాలు, పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకాల గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భరత్‌రాజ్, ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్. తిమ్మాపురంలో స్వామిత్వ గ్రామ సభ

### నేడు ప్రాపర్టీ యజమానులకు నోటీసులు అందజే!

విడపనకల్లు నవంబరు 12 ( ప్రభాత వార్త )

మండలంలోని ఎన్ తిమ్మాపురం గ్రామంలో స్వామిత్వ పథకం అమలులో భాగంగా, ప్రాపర్టీ యజమానులకు 9(2) నోటీసులు మరియు పీపీఎం లు అందజేసేందుకు నేడు ( గురువారం )ఉదయం 11 గంటలకు శివాలయం, ఆర్డిటీ స్కూల్, రచ్చ కట్ట వద్ద గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో సత్య బాబు తెలిపారు. గ్రామ సభలో ప్రాపర్టీ యజమానులకు ఈ నోటీసులు, పీపీఎంలను అందజేస్తారు. అలాగే, ఈ సర్వే వివరాలపై, ఆస్తి సరిహద్దులపై వారికి ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని కూడా సభ ద్వారా స్వీకరించడం జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో సత్య బాబు వివరించారు. నేడు, గురువారం ఉదయం 11 గంటలకు శివాలయం, ఆర్డిటీ స్కూల్, రచ్చ కట్ట దగ్గర జరిగే ఈ గ్రామ సభకు ప్రాపర్టీ యజమానులు తప్పక హాజరై, తమ ఆస్తి వివరాలను పరిశీలించుకోవాలని మరియు సక్రమమైన యాజమాన్య పత్రాల (ప్రాపర్టీ కార్డులు) జారీకి సహకరించాలని అధికారులు కోరారు.

## చిత్రలేఖన పోటీలో రిషి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం రూరల్ నవంబర్ 12 ప్రభాతవార్త



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు ఉపాధ్యాయ బృందం

రిషి విద్యాలయ పాఠశాలలో చిత్రలేఖన పోటీ థింక్ గ్యాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి ప్రిన్సిపల్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి థింక్ గ్యాస్ అసిస్టెంట్ మేనేజర్ రామ్ కిరణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రతిబింబిస్తూ పర్యావరణం ప్రకృతి సౌందర్యం స్వచ్ఛమైన జీవన విధానం గురించి విద్యార్థులు వేసిన చిత్రలేఖనములు చూపించి, దాని ప్రాముఖ్యత అభినందనీయమని తెలిపారు ఈ పోటీలు ద్వారా సృజనాత్మకత పాటు పర్యావరణ పరిరక్షణ పరిరక్షణ పై అవగాహన పెరుగుతుందని తెలిపారు అనంతరం గెలు పొందిన విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందానికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు . ఈ కార్యక్రమంలో నిర్వహించిన పోటీలో విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి , టీచర్లు ఉమాదేవి, రాధా, జోమిష, కుమారి సీఈఓ రవీంద్ర, ఏ.వో రంగారెడ్డి పాల్గొన్నారు.

## పేరూరుకు చెందిన వడ్డి బాలరాజుకు పిహెచ్‌డి ప్రధానం



బాలరాజు

రామగిరి, నవంబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని పేరూరు గ్రామానికిచెందిన వడ్డి వెంకటలక్ష్మి, వడ్డి వెంకటేష్‌ల కుమారుడు వడ్డి బాలరాజుకు పిహెచ్‌డి (డాక్టరేట్) పొందారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆచార్య ఫిరోజ్‌బాబు పర్యవేక్షణలో పిహెచ్‌డి పూర్తి చేసినందుకు డాక్టరేట్ అందుకున్నట్లు బాలరాజు తెలిపారు. వృద్ధుల సామాజికభద్రత, జీవనశైలి ప్రవర్తనలో అనే అంశంపై ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో ఒక అధ్యయనం అన్న అంశంపై పరిశోధనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ, అంతర్జాతీయ జనరల్ ప్రచురితమయ్యాయ న్నారు. జీవనశైలిలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు సామాజిక భద్రతకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించడం భవిష్యత్తులో పిల్లలు తల్లిదండ్రులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వృద్ధుల జనాభా పెరుగుదల గురించి అవగాహన కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. వడ్డి బాలరాజుకు పిహెచ్‌డి ప్రధానం చేయడం పట్ల యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగులు, పరిశోధక మిత్రులు మండలంలోని పేరూరు ప్రజలు అభినందనలు తెలిపారు.

## ఇరిగేపల్లి, ఇరిగేపల్లి గొల్ల హట్టి గ్రామాల్లో పొలం పిలుస్తోంది

అగళి, నవంబర్ 12 ప్రభాతవార్త


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగరాజు

మంగళవారం దాసే గౌడనపల్లి, ముకడాంపల్లి, బుధవారం రోజు ఇరిగేపల్లి, ఇరిగేపల్లి గొల్లహట్టి, గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏఓ నాగరాజు తెలిపారు. రాగి, మొక్కజొన్నలో పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అలాగే రబి సీజన్‌లో వేసుకునే వివిధ రకాల పంటల్లో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్దతులు వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి, వివిధ రకాల పథకాల గురించి వివరించారు. నానో యూరియా, నానో డిఎపి, జిప్సం ప్రాధాన్యత గురించి వివరించారు. రాగి, మొక్కజొన్న, ఉలవ, కంది, పూల పంటలను రైతులతో కలకిసి సందర్శించి ఆపంటలో పాటించాల్సిన యాజమాన్య సస్యరక్షణ పద్దతులను వివరించారు. ఈకార్యక్రమంలో రైతులు, రైతుసేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వబాలికల జూనియర్ కళాశాలకు కుర్చీల వితరణ

ధర్మవరంటౌన్, నవంబరు 12 ప్రభాతవార్త


ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు కుర్చీలు వితరణ చేస్తున్న దృశ్యం

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ఓ దాత కుర్చీలు, రతన్ టాటా ఆర్ట్ వితరణ చేశారు. పట్టణానికి చెందిన సన్ మైక్రో సిస్టమ్స్, ఐటీసీ డిస్ట్రిబ్యూటర్ సూర్యనారాయణ రూ.25 వేలు విలువ చేసే 15 కుర్చీలు, పద్మవిభూషన్ రతన్ టాటా ఆర్ట్ ను కళాశాల అభివృద్ధికమిటి చైర్మన్ బండివేణుగోపాల్, ప్రిన్సిపల్ వనితావాణిలకు వితరణ చేశారు. దాతకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మునిస్వామినాయుడు, సునీత పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులలో అధిక ధరలకు మద్యం విక్రయాలు

### పట్టించుకోని ఎక్సైజ్ శాఖ.

బొమ్మనహాల్ నవంబర్ 12 ప్రభాతవార్త.

కనేకల్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని బొమ్మనహాళ్ మండలంలోని అన్ని గ్రామాలలో బెల్ట్ షాపులలో మద్యం విక్రయాలు అధిక ధరలకు విక్రయిస్తూ మద్యం ప్రియుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారు. 99 రూపాయలకు విక్రయించవలసిన చీప్ లిక్కర్ ను 130 నుంచి150రూపాయలకు విక్రయిస్తున్నారు. 130కు విక్రయించవలసిన అడ్మిరల్ ను 160 రూపాయలకు విక్రయిస్తూ మద్యం ప్రియులను దోపిడీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యమును ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులలో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో ప్రతి దుకాణాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎమ్మార్పీ రేటుకే విక్రయించేటట్లు చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## అనుమతులు లేకుండా కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయిస్తే చర్యలు

ధర్మవరంటౌన్, నవంబరు 12 ప్రభాతవార్త


మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కర్ణాటక మద్యం కానీ నాటుసారా కానీ బెల్టుషాపులు కానీ అక్రమంగా విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. ఈమేరకు బుధవారం ఆయన ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలించారు. ఎక్సైజ్ శాఖ ఏపీ సురక్ష యాప్ ద్వారా ప్రతిషాపులో స్కాన్ చేసి అమ్మకాలు జరిగే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా తరచు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆయన సూచించారు. అంతేకాకుండా బెల్టుషాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. ఫోర్స్ మెంట్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రమణి, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పులబాధతో కూలి ఉరివేసుకుని ఆత్మహత్య

ధర్మవరంటౌన్, నవంబరు 12 ప్రభాతవార్త


ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ప్రవీణ్ కుమార్

అప్పులబాదతో ఓ కూలి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్యసాయినగర్ లో బుధవారం జరిగింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని సత్యసాయినగర్ కు చెందిన ప్రవీణ్ కుమార్(30) కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే ఇంటిలో ఎవరు లేనిసమయంలో ప్రవీణ్ కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రవీణ్ కుమార్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. పోలీసులు మృతురాలి భార్య భూమిక పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు ఉన్నాడు.

## బెంగళూరులో ఉరవకొండ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక..!

ఉరవకొండ, నవంబర్ 12 ప్రభాతవార్త


బెంగళూరులో కలుసుకున్న 1985-86లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు

ఉరవకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో 1985-86లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలయికకు బెంగళూరులోని వెన్యూ రెస్టారెంట్‌లో జరిగిన తమ చిననాటి మిత్రుడి కుమార్తె వివాహ నిశ్చితార్థ కార్యక్రమం వేదికైంది. ముందుగా అనుకున్న మేరకు మిత్రులందరూ ఒక చోట కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలు తెలుసుకొని ప్రస్తుతం ఎవరెవరు ఎక్కడెక్కడ, ఏఏ వృత్తులు, వ్యాపారాల్లో స్థిరపడ్డారో కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుకునే రోజులను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. వీలున్నపుడు అందరూ కలుస్తూ ఉండేలా మొబైల్ నంబర్లు, చిరునామాలను ఒకరినొకరు తీసుకున్నారు. ఈ కలయిక చిరకాలం గుర్తుండిపోయేలా ఫోటోలు దిగారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహిత సోమలాల్ నాయక్‌ను కలిసిన బీజీఎస్ జాతీయ అధ్యక్షుడు మహేష్‌నాయక్

### -సద్గురు సేవాలాల్ బోధనలు విస్తృతంగా ప్రచారం చేయాలని విజ్ఞప్తి

ఉరవకొండ, నవంబర్ 12 ప్రభాతవార్త


పద్మశ్రీ అవార్డు గ్రహిత సోమలాల్ నాయక్‌కు జ్ఞాపికను అందిస్తున్న బీజీఎస్ జాతీయ అధ్యక్షులు ఎస్.కె.మహేష్‌నాయక్

పద్మశ్రీ అవార్డు గ్రహిత డా॥సోమ లాల్ నాయక్‌ను బుధవారం బంజారా గిరిజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు, సేవాలాల్ మహా రాజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు డా॥ఎస్.కె.మహేష్ నాయక్ బంజారా మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు షాలువాకప్పి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్బంగా ఎస్.కె.మహేష్‌నాయక్ బంజారా మాట్లాడుతూ 15 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవమైన సద్గురు సేవాలాల్ మహారాజ్ బోధనలను నేటి యువతరం విస్తృతంగా ప్రచారం చేసి బంజారాలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరముందని అన్నారు. సద్గురు ఆశయ సాధనకై బంజారాలు మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ ఆదర్శవంతమైన జీవనం గడపాలన్నారు. లక్కీషా బంజారా కాంస్య విగ్రహాన్ని భారత పార్లమెంటులో ఏర్పాటు చేయాలని, హాతీరాం బాబా మఠం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. సేవాలాల్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించి ఉత్సవాలకు 100 కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణలో సేవాలాల్ ఆలయం నిర్మాణానికి కృషి చేస్తున్న రాములు నాయక్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## మంత్రి చొరవ..పూర్తి అయిన విడపనకల్లు-గడేకల్లు బీటీ రోడ్డు

### -ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు చెబుతున్న ప్రజలు

ఉరవకొండ, నవంబర్ 12 ప్రభాతవార్త


నూతనంగా ఏర్పాటైన విడపనకల్లు-గడేకల్లు బీటీ రోడ్డు

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవతో విడవనకల్లు-గడేకల్లు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. విడవనకల్లు నుండి గడేకల్లు వరకు 12 అడుగుల వెడల్పుతో 8.6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు ఏర్పాటు కావడంతో విడపనకల్లు, ఆర్.కొట్టాల, గడేకల్లు, కదదరబెంచి, ఎన్.తిమ్మాపురం, పెంచలపాడు, పొలికి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికు కృతజ్ఞతలు చెబుతున్నారు. రోడ్డు చిద్రమైపోవడంతో వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించడానికి మొన్నటి వరకు చాలా ఇబ్బందులు పడేవారమని మా ఇబ్బందులను గుర్తించి మంత్రి పయ్యావుల కేశవ్ జూలై 5న రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి అనతికాలంలోనే పనులు పూర్తి చేయించారని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నూతన రోడ్డు ఏర్పాటు కావడంతో ఆర్టీసీ బస్సు విడపనకల్లు-గుంతకల్లు మార్గంలో రోజుకు 6 సింగల్స్ తిరుగుతోందని రవాణా సౌకర్యం కూడా మెరుగుపడిందని వారు చెబుతున్నారు.

## నాయిబ్రాంహణజిల్లా అధికార ప్రతినిధిగా నరసింహులు ఏకగ్రీవం

బ్రహ్మసముద్రం నవంబర్ 12 ప్రభాతవార్త


ఏకగ్రీవ పత్రం అందుకుంటున్న నరసింహులు

గుంటూరులో జరిగిన రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం కార్య వర్గ సమావేశం రిజిష్టరు నంబర్ 126/2018. సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి బాల గురు స్వామి ఆద్వర్యంలో జరిగిన . కార్య వర్గ సమా వేశంలో కళ్యాణ దుర్గం నియోజక వర్గానికి చెందిన గుండిగాని పల్లి నరసింహులు ను అనంతపురం జిల్లా అధికార ప్రతి నిధిగాను మరియు విట్లంపల్లి భజంత్రి తిమ్మప్పను అనంతపురం జిల్లా ఉపాధ్యాక్షులుగాఎన్నుకోవడం జరిగింది వీరి ఎంపిక పట్ల బ్రహ్మ సముద్రం మండల పరిధిలోని నాయిబ్రాహణులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది

## గాయపడిన సర్పంచును పరామర్శించిన వైకాపా నియోజకవర్గం ఇన్‌చార్జ్ టిఎన్ దీపిక

లేపాక్షి, నవంబర్ 12 ప్రభాతవార్త


పులమతి సర్పంచును పరామర్శిస్తున్న నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జ్ దీపిక

లేపాక్షి మండల పరిధిలోని పులమతి పంచాయతీ సర్పంచు అశ్వర్థనారాయణ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే హిందూపురం వైకాపా ఇన్‌చార్జ్ దీపిక ఆసుపత్రికి వెళ్లి అశ్వర్థనారాయణను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సయ్యద్ నిసార్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు తిప్పన్న, మండల యూత్ వింగ్ అధ్యక్షులు చరణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మల్లన్న, రామాంజి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన టిడిపి నాయకులు

గుత్తి, నవంబర్ 12 ప్రభాతవార్త


కోర్టుకు నాయకులు హాజరైన దృశ్యం

గుత్తి పట్టణంలోని కోర్టుకు ఎన్నికల ప్రచారం వ్యవహారంలో నమోదైన కేసులో టిడిపి నాయకులు బుధవారం హాజరయ్యారు. 2009 ఏప్రిల్ నెలలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో హాజరైన ప్రముఖ సినీ నటుడు రాజకుమార్, చంద్ర దండు వ్యవస్థాపకుడు ప్రకాష్ నాయుడులు ఈ సందర్భంగా కోర్టుకు హాజరయ్యారు. వీరికి ఏజీపీ ఫక్రుబాష, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, టిడిపినాయకులు భీమా,రమేష్ తదితరులు ఆహ్వానం పలికారు.

## అమీన్‌పల్లి, గుండాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారిని

గుంతకల్లు, నవంబర్ 12 ప్రభాతవార్త

మండల పరిధిలోని అమీన్‌పల్లి, గుండాల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిని డి.లీనా వసుంధర రైతులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. ప్రధానంగా అపరాల పంటల్లో తెల్లదోమ, పేనుబంక నివారణపై చర్చించి ఏఏ మందులను, ఎంత మోతాదులో వాడాలో రైతులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈఒ లోకేష్, విఏఏ అఖిల్ బ్రహ్మ, రైతులు పాల్గొన్నారు.

## ఉరవకొండలో కూల్ డ్రింక్స్ దుకాణంలో చోరీ

ఉరవకొండ, నవంబర్ 12 ప్రభాతవార్త


చోరీ జరిగిన శివగంగ కూల్‌డ్రింక్స్ దుకాణం


క్యాష్ బాక్సును తెరిచిన దృశ్యం

పట్టణంలోని గుంతకల్లు రోడ్డు ప్రధాన కూడలిలోగల శివగంగ కూల్‌డ్రింక్స్ దుకాణంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు దుకాణం షెట్టర్‌కు వేసిన తాళం బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించి 20వేల రూపాయలు విలువచేసే సిగరెట్టు బండిళ్లతోపాటు క్యాష్ బాక్సులోని 5వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లారని బాధితుడైన దుకాణం యజమాని రాజ్‌కుమార్ తెలిపారు. చోరీ ఘటనపై పోలీసులకు సమాచారం అందించగా వారు దుకాణాన్ని పరిశీలించారు. పట్టణంలోని దుకాణాల్లో చోరీలు జరుగుతుండటంతో వ్యాపారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## బ్రెయిన్ ట్యూమర్‌తో డిగ్రీ విద్యార్థి దాసా పునీత్‌కుమార్ మృతి

### -కళాశాల తరగతులు రద్దుచేసి సంతాపం తెలిపిన ప్రిన్సిపాల్, సిబ్బంది

ఉరవకొండ, నవంబర్ 12 ప్రభాతవార్త


తరగతులను రద్దుచేసి జరిపిన సంతాప కార్యక్రమం దృశ్యం


దాసా పునీత్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

ఉరవకొండ పట్టణానికి చెందిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన దాసా పునీత్‌కుమార్ (21) బుధవారం బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు బెంగళూరులో చికిత్స చేయిస్తున్నారని ఈ క్రమంలోనే విద్యార్థి మధ్యాన్నం 1.30 గంటల సమయంలో ఇంట్లోనే తుదిశ్వాస విడిచాడని తెలిసింది. పునీత్‌కుమార్‌కు తల్లిదండ్రులు దాసా రాఘవేంద్ర, కుసుమ, ఇంటర్ చదువుతున్న సోదరి ఐశ్వర్య ఉన్నారు. విద్యార్థి పునీత్‌కుమార్ మరణానికి సంతాప సూచకంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను రద్దు చేసి సంతాప కార్యక్రమం నిర్వహించిన ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ విద్యార్థి ఆత్మ శాంతికై అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించి విద్యార్థి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పునీత్‌కుమార్ క్రమశిక్షణ కల్గిన మంచి విద్యార్థి అని మితభాషి అయిన అతను చదువుపై ఎంతో ఆసక్తికనబర్చేవాడని అతని మరణం కళాశాలకు కూడా తీరని లోటన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా నాయకులు నిరసన..


మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ ఆపాలంటూ వైకాపా నాయకులు ర్యాలీ దృశ్యం.

మడకశిర టౌన్ నవంబర్ 12 ప్రభాతవార్త

మడకశిర పట్టణంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం నిరసన ర్యాలీ జరిగింది. వైసిపి పార్టీ సమన్వయకర్త ఈర లక్కప్ప ఆధ్వర్యంలో ఈర్యాలీ జరిగింది. బుధవారం పట్టణంలోని వాల్మీకి సర్కిల్ లో తొలుత కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. అనంతరం వాల్మీకి సర్కిల్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. చంద్ర బాబు సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప, సిఈసి,మెంబర్,మాజీ మంత్రి హెచ్బీ నర్సేగౌడ్. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ: చంద్రబాబు మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరంచేసి పేద విద్యార్థులకు వైద్య విద్య ను దూరం చేశారని విమర్శించారు. పేదలు వైద్య సేవలను డబ్బులు పెట్టి పొందాల్సిన పరిస్థితి తీసుకు వచ్చారని తెలిపారు. చంద్రబాబు తన వారికి మెడికల్ కాలేజీలను అప్పగించి పేదలకు అన్యాయం చేశారని ఆరోపించారు. మెడికల్ కాలేజీలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేశారు. ఈనరసన కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి.రాష్ట్ర లీగల్సేల్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్. ఆనందంగారెడ్డి. మాజీ సర్పంచ్ వాగేష్. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి. రాష్ట్ర వక్కలిగా కమిటీ సభ్యులు రంగే గౌడ్. జడ్పిటిసిలు. ఎంపీపీలు. సర్పంచులు. కౌన్సిలర్లు కన్వీనర్లు.తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి రెగ్యులర్‌ఓపెన్ పబ్లిక్ పరీక్షల ఫీజును ఈనెల 25 వ తేదీ లోపు చెల్లించండి.

### 500 రూపాయలు అపరాధ రుసుముతో డిసెంబర్ 15 లోపు

కొత్తచెరువు నవంబర్ 12 ప్రభాతవార్త.

మార్చి /ఏప్రిల్ 2026 లో జరగబోవు రెగ్యులర్ మరియు ఓపెన్ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయు అభ్యర్థులు, పరీక్ష తప్పిన విద్యార్థులు నేటి నవంబర్ 13 నుంచి ఈ నెల 25వ 2025 తేదీ లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయు ల కు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి కృష్ణప్ప ఓ ప్రకటనలో తెలిపారు. 50 రూపాయల అపరాధ రుసుముతో నవంబర్ 26 నుంచి డిసెంబర్ మూడో తేదీలోపు చెల్లించాలి, అలాగే 200 రూపాయలు అపరాధ రుసుముతో డిసెంబర్ 4 నుంచి డిసెంబర్ 10వ తేదీ లోపు చెల్లించాలి, అలాగే 500 అపరాధ రుసుముతో డిసెంబర్ 11 నుంచి డిసెంబర్ 15వ తేదీ లోపు చెల్లించాలి. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు 125 రూపాయలు, మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు125 రూపాయలు, మూడు కన్నా తక్కువ సబ్జెక్టులకు 110 రూపాయలు, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటుఅదనంగా 60 రూపాయలు, తక్కువ వయసుకోసం 300రూపాయలు, మైగ్రేషన్ కోసం 80 రూపాయలు చెల్లించాలి. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యు డైస్ ప్లస్ పోర్టల్ నందు విద్యార్థి వివరాలు ధ్రువీకరించిన తర్వాత www.bse.ap.gov.in వెబ్సైట్ లోని పాఠశాల లాగిన్ ద్వారా అప్లికేషన్ డౌన్లోడ్ చేసి పరీక్షా రుసుము చెల్లించాలని డిఈఓ తెలిపారు.

## పేదలకు విద్య, వైద్యం అందకుండా చేస్తున్నారు

### వైఎస్సార్సీపీ ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


కేతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం నిరసన ర్యాలీ చేపడుతున్న దృశ్యం.

ధర్మవరం టౌన్ నవంబరు 12 ప్రభాతవార్త

పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందాలని ఎంతో ముందు చూపుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి రాష్ట్రంలో రూ.8.400కోట్ల వ్యయంతో 17 మెడికల్ కాలేజీలను నిర్మించాలని చర్యలు చేపడితే, ఎన్నికల అనంతరం మోసపూరిత హామీలతో గెలిచిన సీఎం చంద్రబాబు నాయుడు వాటిని ప్రైవేటీకరణ చేసి చరిత్రహీనుడిగా మారి పేదలకు తీవ్ర అన్యాయం


నిరసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేతిరెడ్డి

చేశారని మాజీఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చర్యను నిరిసిస్తూ బుధవారం కేతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రణాఉద్యమం నిరసనర్యాలీచేపట్టారు. స్థానిక ఎస్బీఐ కాలనీనుండి కళాజ్యోతిసర్కిల్, కాలేజ్‌సర్కిల్‌మీదుగాప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలుచేస్తూ ర్యాలీనిర్వహించారు. అనంతరం ఆర్టీవో కార్యాలయం ఎదురుగా నిరసనతెలిపారు. ఈసందర్భంగా కేతిరెడ్డిమాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేవలం 12మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవన్నారు. జగనన్న ప్రభుత్వంలో గత మూడేళ్ల వ్యవధిలో 17మెడికల్ కాలేజీలను నిర్మించేలా చర్యలు చేపట్టి దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారన్నారు. జగన్‌సంకల్పం సాకారమైఉంటే ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందేదన్నారు. అలానే ఎంతో మంది పేద రోగులకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అంది ఉండేదన్నారు. పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్షిప్) విధానంలో అతి తక్కువ ధరకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం ద్వారా పేదలకు సాయం అదే పరిస్థితి లేదన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కోసం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణ ఒక కార్యక్రమం కాదని కోట్లాది మంది ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తుందన్నారు. దర్మవరం నియోజకవర్గం నుండి 70వేలకు పైగా కోటి సంతకాల సేకరణ చేపట్టామని త్వరలో మరింత మందితో కార్యక్రమం నిర్వహించి పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ధర్మవరం నియోజకవర్గ పరిశీలకుడు నార్పల సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర కమిటి సభ్యులు, జిల్లా కమిటి సభ్యులు, నియోజకవర్గ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అధికారులు

గుత్తి, నవంబర్ 12 ప్రభాతవార్త



అధికారులు పరిశీలిస్తున్న దృశ్యం

మండలంలోని జక్కలచెరువు గ్రామంలో ఉన్న ఎంపిపి పాఠశాలను బుధవారం జిల్లా ఏఎస్ఓపి వేణుగోపాల్, ఏఎస్ఓ రామనారాయణ స్వామిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతికై ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు అందించారు. అదేవిధంగా అభ్యసన సామాగ్రిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ లక్ష్మణ్, హెచ్ఎం కేశవనాయుడు, ఉపాధ్యాయులు కళ్యాణి, సుప్రియ, నాగరత్న, రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగు మెలకువలతో... పల్లెల్లో పొలం పిలుస్తోంది

### -కొండాపురం రైతు సేవాకేంద్రంలో...వ్యవసాయ శాఖ అధికారి శంకర్‌నాయక్

గోరంట్ల, నవంబర్ 12 ప్రభాతవార్త


పంట పొలాల్లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని కొండాపురం రైతు సేవాకేంద్రంలో మండల వ్యవసాయాధికారి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో రైతు సేవాకేంద్రంలో సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. రబి సీజన్‌లో రైతులు పంటలు వేసుకొనేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేసారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న వేసిన రైతులు పంట మార్పిడి చేసుకోవాలని విల్ట్ తెగులు ఎక్కువగా ఉన్నపుడు ట్రైకోడెర్మ విరిడీని పశువుల ఎరువులో కలుపుకొని వేసుకోవడం ద్వారా తగ్గించవచ్చున్నారు. అలాగే విత్తేటప్పుడు 60.20 సిఎం విత్తనాలు నాటుకోవాలన్నారు. స్వల్ప మరియు మధ్య కాలిక రకాలను నాటుకోవాలని, వేరుశనగలో 40-45 రోజులు దశలో జిప్సం ఎకరాకు 200 కేజీలు వేసుకోవాలని దీని వలన నూనె శాతం పెరుగుతుందన్నారు. అలాగే తాలు గింజలు లేకుండా దిగుబడి పెరుగుతుందన్నారు. ట్రైకోడెర్మ విరిడీ మండల వ్యవసాయ కార్యాలయం లో లభిస్తుందన్నారు. అలాగే రైతు సేవాకేంద్రంలో జిప్సం లభిస్తుందన్నా రు. కొండాపురం పంచాయితీలోని గజులవాండ్లపల్లిలో పొలం పిలుస్తోంది కార్యకరం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో 100 శాతం పంట నమోదు జరిగిందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు విశేష స్పందన

గుంతకల్లు, నవంబర్ 12 ప్రభాతవార్త


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఆలూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వద్ద నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ ఆదాలత్‌కు విశేష స్పందన లభించింది. గుంతకల్లు సబ్ డివిజన్ పరిధిలోని డి1, డి2, రూరల్, వజ్రకరూరు, గుత్తి సబ్ డివిజన్ పరిధిలోని పెద్దవడుగూరు, పామిడి, గుత్తి మండలాలకు సంబంధించిన 30 మంది వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తామని అధికారులుపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.పద్మనాభపిళ్ళై, ఏడిఈ నాగేంద్ర, ఏఏఓ యుగంధర్, ఏఈలు ప్రసన్నకుమార్, రఘు, అబ్దుల్ మన్నన్, సిబ్బంది పాల్గొన్నారు.

